క్లుప్తంగా

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పాలకులు పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో బుధవారం కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసంసిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు దీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన కోరారు. యాజమాన్యం, కార్మిక నాయకులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, ఇస్మాయిల్, పుష్పరాజు, పిచ్చయ్య, బాషా, సుబ్బారావు, సామ్రాజ్యం, రిబ్కా, నూర్జహాన్, మాలిన్, గురవయ్య పాల్గొన్నారు.

చిత్తు బొమ్మ ఆట స్థావరాలపై పోలీసుల దాడి

తాడికొండ: మండలంలోని పొన్నెకల్లు పంట పొలాల్లో చిత్తు బొమ్మ ఆడుతున్న స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నిర్వహించిన దాడుల్లో 16 మందితో పాటు, రూ. 16,800ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

అలరించిన నృత్య జాగరణ



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలోని అన్నమయ్య కళావేదికపై బుధవారం మహా శివరాత్రి సందర్భంగా రాత్రి ఏడు గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు శివపాద మంజీర నాదం -2, శివరాత్రి నృత్య జాగరణ నిర్వహించారు. సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో జరగ్గా, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ అధ్యక్షులు సీ.హెచ్.మస్తానయ్య ప్రారంభించారు. 108 మంది తమ నృత్య ప్రదర్శనతో శివునికి నృత్య నివేదన చేశారు. నాట్యాచార్య డాక్టర్ కాజ వెంకటసుబ్రహ్మణ్యం నృత్య దర్శకత్వంలో ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమాన్ని వెంకటగిరి నాగలక్ష్మి, తాళ్లూరి ధరణి, పూజిత, శ్రీమహిత పర్యవేక్షించారు.

'మిస్టర్ నాగార్జున'కు అభినందన



తెనాలి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 24న జరిగిన అంతర కళాశాలల శరీర సౌష్టవ పోటీల్లో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ విద్యార్థి ఎస్.వంశీ తన ఆల్‌రౌండ్ ప్రతిభతో బంగారు పతకం సాధించి, 'మిస్టర్ నాగార్జున' టైటిల్‌ను సాధించాడు. మార్చిలో కేరళలో జరగనున్న అంతర యూనివర్సిటీల పోటీలకు ఏఎన్‌యూ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. స్థానిక గంగానమ్మపేటలోని క్విక్ ఫిట్‌నెస్ ఎరీనాకు చెందిన బాడీబిల్డర్ వంశీని సంస్థ యాజమాన్యం, కోచ్‌లు బుధవారం అభినందించారు. అతడితో పాటు తమ దగ్గర శిక్షణ పొందుతున్న ఎం.షానూన్ మార్చి 17-20 తేదీల్లో జమ్మూకశ్మీర్‌లో జరగనున్న ఆలిండియా పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు కేఎల్‌యూ తరపున ప్రాతినిధ్యం వహిస్తోందని ఎరీనా నిర్వాహకులు తెలిపారు. రానున్న మే నెలలో జరగబోయే ఆసియన్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు షానూన్ భారత్ తరపున ప్రాతినిధ్యం వహించనుండటం గర్వకారణంగా చెప్పారు. అదేవిధంగా తమ విద్యార్థిని ఈఎల్ వినయశ్రీ కూడా మే నెలలో జరిగే ఆసియన్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు భారత్ తరపున పాల్గొననున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా వంశీ, ఇతర మహిళా లిఫ్టర్లను కేవీఐకే జిమ్ యాజమాన్యం కొమ్మినేని భార్గవ్‌కుమార్, కోచ్‌లు ఘట్టమనేని సాయిరేవతి (కామన్‌వెల్త్ గోల్డ్ మెడలిస్ట్), పూసపాటి శివరామకిరణ్‌రాజు అభినందించారు.

కైలాసవాసా... సదా శివా..!



అత్మకూరులో భక్తులకు దర్శనమిస్తున్న పరమేశ్వరుడు

- భక్తిశ్రద్ధలతో శివరాత్రి వేడుకలు
- భక్తులతో పోటెత్తిన శివాలయాలు



దుగ్గిరాల శివాలయంలో శివ లింగానికి క్షీరాభిషేకం



వేమవరంలోని కోటి లింగాల క్షేత్రంలో మహానంది వద్ద భక్తుల పూజలు

మంగళగిరి టౌన్: ఓం నమఃశివాయ... శివాయ నమః అంటూ భక్తులు శివుడ్ని దర్శించుకుని పరవశం చెందారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని తరలి వచ్చిన భక్తులతో శైవక్షేత్రాలతో పాటు వివిధ దేవాలయాలు బుధవారం కిటకిటలాడాయి. అభిషేక ప్రియుడైన బోళాశంకరునికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, రుద్ర హోమాలు నిర్వహించారు. రాత్రి శివాలయాల వద్ద భక్తులు జాగరణ చేశారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల్లో మహా శివరాత్రి అత్యంత వైభవంగా జరిగింది. తెల్లవారుజామునే 3 గంటల నుంచి శివాలయాల ప్రాంగణాలు కిటకిటలాడాయి. నగర పరిధిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు బారులుతీరారు. స్వామిని దర్శించుకుని తన్మయులయ్యారు. భక్తులు ఉపవాస దీక్ష బూని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పలు సేవా సంస్థలు, దేవస్థానంతో పాటు బయటఉన్న కల్యాణ గ్రౌండ్‌లో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా నిలిచాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ అధికారులు, కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీస్ శాఖ బందోబస్తు నిర్వహించింది.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో మహాశివరాత్రిని పురస్కరించుకొని బుధవారం విశేష పూజలు నిర్వహించారు. వేములూరిపాడులోని జలపాలేశ్వరుడి ఆలయంలో స్వామికి అర్చకులు ఉమాపతిశాస్త్రి నమకచమకాలతో అభిషేకాలు చేశారు. ఫిరంగిపురంలోని రెడ్డిరాజులు నిర్మించిన మహాకాళహస్తీశ్వరుడికి అర్చకులు ఆంజనేయశర్మ అంగన్యాస, కరన్యాసాలతో అభిషేకాలు నిర్వహించారు. నుదురుపాడులోని అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వర స్వామికి అర్చకులు పూర్ణచంద్రశాస్త్రి పంచామృత అభిషేకాలు చేశారు. వేమవరంలోని కోటి లింగాల క్షేత్రంలో మహాకాళీ సహిత మహాకాళేశ్వరుడికి విశేష అర్చనలు చేశారు. నర్మద బాణ శివలింగానికి భక్తులు అభిషేకాలు చేయించారు. మహాలింగోద్భవ సమయంలో మహారుద్రంతో అభిషేకాలు నిర్వహించారు. మహానంది వద్ద, కోటిలింగాల వద్ద పూజలు చేశారు.

శివాలయాలకు వెల్లువెత్తిన భక్తులు

మంగళగిరి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో శివాలయాలను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి జాగరణ చేసేలా ఏర్పాట్లు చేసుకున్నారు. నగర పరిధిలోని ఆత్మకూరు శివాలయం, కాజలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం, నిడమర్రు శివాలయం, యర్రబాలెం, నవులూరులోని శివాలయాలలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున ఆలయాలలో స్వామిని దర్శించుకున్నారు.

మార్మోగిన శివ నామస్మరణ

తాడికొండ: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని తాడికొండ, తుళ్లూరు మండలాల్లోని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఆలయాలకు పోటెత్తారు. స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో తాళ్లాయపాలెంలోని శైవక్షేత్రం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. తాడికొండ కొండపై ఉన్న మల్లికార్జున స్వామి ఆలయానికి ఘాట్ రోడ్డు ద్వారా వెళ్లేందుకు అధికారులు వసతులు కల్పించారు. ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలపై భక్తులు వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. శివనామస్మరణ జాగరణకు ఏర్పాట్లు చేయడంతో తాడికొండ, తుళ్లూరు మండలాల్లోని శివాలయాల్లో భక్తులు సందడి నెలకొంది.

శివాలయాలకు భక్తుల తాకిడి

దుగ్గిరాల: మహా శివరాత్రిని పురస్కరించుకుని మండల పరిధిలోని పెదకొండూరులో గల శ్రీగంగా దుర్గా పార్వతి సమేత శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కల్యాణ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తిలకించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకులు లక్ష్మీపంత్ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కృష్ణ నది అంచున ఉన్న శ్రీ ఆనందేశ్వర ఆలయంలో తెల్లవారుజాము నుంచే స్వామి వారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. దుగ్గిరాల శివాలయంలో ఉదయం నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



మంగళగిరి శివాలయంలో దర్శనం కోసం వేచిఉన్న భక్తులు



లాంలోని శైవక్షేత్రంలో ప్రత్యేక పూజల్లో భక్తులు

త్రిలోకాధిపతికి వెండి నామాలు బహూకరణ



మంగళగిరి టౌన్: నగర పరిధిలోని రెండు వైష్ణవ దివ్యక్షేత్రాల నడుమ ఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలోని శివుని విగ్రహానికి అలంకరించే నిమిత్తం వెండి నామాలను భక్తులు బహూకరించారు. మంగళగిరి నగరానికి చెందిన విడేల సాయిశ్రీనివాస్, హారిక దంపతులు మూడో కన్ను కలిగిన వెండి నామాలను బుధవారం ఆలయ ఈవో జెవి నారాయణకు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మహేష్‌కుమార్ శర్మ వెండి నామాలను స్వామివారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులా లేక కూలీలా !

విద్యా శాఖ మంత్రి ఇలాకాలో విద్యార్థులతో పనులు

- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు
- సోషల్ మీడియాలో హల్‌చల్



స్కూలు భవనంపైకి కుర్చీలు మోస్తున్న విద్యార్థులు

మంగళగిరి: మంత్రి లోకేష్ నియోజకవర్గంలోనే విద్యార్థులతో పనులు చేయిస్తున్న ఘటన వెలుగులోకి రావడం స్థానికులను ఆశ్చర్యానికి గురి చేసింది. పట్టణంలోని సెయింట్ ఫ్రాన్సిస్ ప్రైవేటు స్కూలులో శివరాత్రిని పురస్కరించుకుని పబ్లిక్ హాలిడే ఇచ్చిన రోజు సైతం విద్యార్థులను పిలిపించి పనులు చేయించడం విశేషం.సెలవు రోజు తరగతులు నిర్వహించడమే కాక విద్యార్థులతో బెంచీలను మొదటి అంతస్తు నుంచి నాలగో అంతస్తుకు మోపించారు.మెట్లకు కనీసం ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ఎదురుగా హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉన్నాయి. అయినా స్కూలు యాజమాన్యం నిర్లక్ష్యంగా విద్యార్థులతో బెంచీలు మోపించడం ఆందోళనకు గురి చేసింది. ఘటనను కొందరు యువకులు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆర్టీసీ సేవలను ఉపయోగించుకోండి



తెనాలి అర్బన్: ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు తీసుకువెళ్ళేది ఆర్టీసీ బస్సులని, అందరు వాటిలో ప్రయాణించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని తెనాలి డిపో నుంచి గోవాడ, క్వారీలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు సర్వీస్‌లను బుధవారం తెల్లవారుజామున ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ తెనాలి డిపో నుంచి క్వారీకి 30, గోవాడకు 30, శ్రీశైలంకు 8, చెరుకుపల్లి, గోవాడకు అదనంగా మరో 2 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్సులు బుధవారం తెల్లవారుజాము నుంచి గురువారం ప్రయాణికుల రద్దీ తగ్గే వరకు తిరుగుతూనే ఉంటాయని చెప్పారు. సాధారణ చార్జీలకే బస్సులు నడుపుతున్నట్లు వివరించారు. ప్రయాణికులంతా ఆర్టీసీ బస్సు సేవలను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

తెనాలి రూరల్: స్వల్ప వివాదం నేపథ్యంలో తెనాలిలో వ్యక్తిపై కత్తితో దాడి జరిగిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. మారీసుపేట పరిధిలో వైకుంఠపురం ఎదురుగా నివసించే దేవరకొండ నాగరాజుపై చేపల శ్రీను కొబ్బరి బొండాల కత్తితో దాడికి దిగటం తీవ్ర కలకలం రేకెత్తించింది. ఓ స్థలానికి సంబంధించిన వివాదంలో నాగరాజుపై చేపల శ్రీను కొబ్బరి బొండాల కత్తితో దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారిస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- నియోజకవర్గ వ్యాప్తంగా 15,380 మంది ఓటర్లు
- నేడు ఓటు హక్కు వినియోగించుకోనున్న పట్టభద్రులు



వీటీజేఎం కళాశాలలో ఏర్పాటు చేసిన టెంట్లు

మంగళగిరి టౌన్ / మంగళగిరి : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలు గురువారం జరుగనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మంగళగిరి నియోజకవర్గ ఎన్నికల అధికారులు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 15,380 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాలలో ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

✦ మంగళగిరి పట్టణ పరిధిలో అర్బన్ ఓటర్లకు వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ కళాశాలలో ఆరు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో 4,500 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

✦ మంగళగిరి రూరల్ పట్టభద్రుల కోసం సీకే హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఐదు పోలింగ్ బూత్‌లలో 8,000 మంది ఓటర్లు ఓటు వేయనున్నారు.

✦ తాడేపల్లి మండల పరిధిలో మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముగ్గురోడ్‌లోని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్, ఉండవల్లిలోని గాదె రామయ్య సీతారావమ్మ మండల పరిషత్ హైస్కూల్, క్రిస్టియన్ పేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మొత్తం 7 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో 4971 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

✦ దుగ్గిరాల మండలంలోని దుగ్గిరాలలో జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్‌లో మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. 2254 మంది పట్టభద్రులు ఓటు వేయనున్నారు.

అధికారుల నియామకం

నియోజకవర్గ వ్యాప్తంగా మూడు మండలాల్లో 21 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రానికి సెక్టార్ ఆఫీసర్‌ను, ఏపీఆర్‌వోను నియమించారు. ఒక్కొక్క పోలింగ్ బూత్‌కు పీవో, ఏపీవో, ఇద్దరు ఓపీవోలు, ఒక మైక్రో అబ్జర్వర్‌ను ఎన్నికల అధికారులు నియమించారు. బుధవారం సాయంత్రానికి పోలీస్ సిబ్బందితో బ్యాలెట్ బాక్సులు, ఇతర ఓటింగ్ సామగ్రితో వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకుని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పోలింగ్ సిబ్బంది కేంద్రాలకు చేరుకునేలా జిల్లా అధికారులు రవాణా సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా పలువురు సెక్టార్ అధికారులు మాట్లాడుతూ సిబ్బందికి ఆహారం, స్నాక్స్, మంచినీరు ఏర్పాటు చేశామని చెప్పారు. ఓటు హక్కును వినియోగించుకునే పట్టభద్రులకు మౌలిక వసతులు కల్పించామని పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత మధ్య రిసెప్షన్ సెంటర్లకు చేర్చనున్నట్లు తెలిపారు.



ఓటింగ్ సామగ్రితో కేంద్రాలకు వస్తున్న సిబ్బంది

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

తాడికొండ: ఎమ్మెల్సీ ఎన్నికలకు తాడికొండ, తుళ్లూరు మండలాల్లో ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశారు. తాడికొండ ఎస్‌వీవీ హైస్కూల్‌లో మూడు పోలింగ్ బూత్‌ల ద్వారా మొత్తం 2,232 మంది ఓటర్లు ఓటును వినియోగించుకోనున్నారు. తుళ్లూరు మండలంలో కేవీఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మూడు బూత్‌ల ద్వారా 2,667 మంది వినియోగించుకోనున్నారు. ఇందుకు గాను ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద తాగునీరు, క్యూలైనులు, షామియానా, సిబ్బంది కోసం వసతులు కల్పించారు. బుధవారం పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాట్లను గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో తాడికొండ, తుళ్లూరు తహసీల్దార్లు మెహర్‌కుమార్, సుజాత, ఎంపీడీవోలు సమతావాణి, కానూరి శిల్ప, పలువురు రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

దుగ్గిరాలలో..

ఎమ్మెల్సీ ఎన్నికలకు దుగ్గిరాలలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ సిద్ధమైంది. కేంద్రంలోని మూడు బూత్‌ల వద్ద అధికారులు బ్యారికేడ్‌లు, ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. మండల పరిధిలోని 2,254 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వారంతా స్వేచ్ఛగా ఓటు వేసుకుని సదపాయాలను వారు కల్పించారు. బుధవారం తహసీల్దార్ ఐ. సునీత్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి పలుసూచనలు చేశారు.

ఫిరంగిపురంలో...

కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సెయింట్‌పాల్స్ హైస్కూల్‌లో సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ బుధవారం తెలిపారు. పాఠశాలలో బూత్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో 205, 206, 206- ఏ బూతుల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. మండల వ్యాప్తంగా 2074 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇందులో 1319 మంది పురుషులు కాగా, 755మంది మహిళలు ఉన్నట్లు వివరించారు. ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కేంద్రానికి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా వెంట ఆధార్ కార్డు, లేదా డ్రైవింగ్ లైసెన్సు, పాన్‌కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, సర్వీస్ ఐడెంటిటీ కార్డు, డిగ్రీ సర్టిఫికెట్టు తెచ్చుకోవాలని ఆయన సూచించారు. ఉదయం 8గంటల నుంచి యంత్రం 4గంటల వరకు ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు.

సెల్ ఫోన్ ద్వారా పోలింగ్ కేంద్రాల సమాచారం

మంగళగిరి: మంగళగిరి పట్టణ, గ్రామాలలోని ఓటర్లు పోలింగ్ కేంద్రాల సమాచార వివరాలను సెల్ ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చని ఎలక్షన్ డెప్యూటీ తహసీల్దార్ రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.పట్టణ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వివరాలకు (90143 79918) ఆపరేటర్ టి.మధుసూదన్ వ్యవహరిస్తారని తెలిపారు. రూరల్ పోలింగ్ కేంద్రాలకు (78160 55934) ఆపరేటర్ టి. వేణు వ్యవహరిస్తారని చెప్పారు. ఓటర్లు ఇబ్బంది లేకుండా పోలింగ్ కేంద్రం సమాచారం తెలుసుకోవాలని ఆయన సూచించారు.



తాడికొండలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు



దుగ్గిరాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ సునీత

జోరుగా బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు

- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో దుకాణాల మూత
- దొడ్డిదారిన బెల్టు షాపులతో అధిక ధరలకు విక్రయం

తాడికొండ: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మద్యం ప్రియులకు నెత్తిన పిడుగుపడింది. ఎన్నికలకు 48 గంటల ముందు దుకాణాలకు ఎక్సైజ్ అధికారులు సీల్ వేయడంతో బెల్టు షాపుల ద్వారా విక్రయాలకు నిర్వాహకులు తెరలేపారు. తాడికొండ, తుళ్లూరు మండలాల్లో బెల్టు షాపులు, వ్యక్తిగత సహాయకులను ఏర్పాటు చేసి దుకాణాల వద్దే జోరుగా మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మందు బాబుల జేబులు ఖాళీ చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు ఈవైపు తొంగి చూడకపోవడం వెనుక అంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. స్థానిక పోలీసులు తాడికొండ మండలంలో దాడులు నిర్వమించి 120 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయగా, ఎక్సైజ్ పోలీసులు అటువైపు తొంగిచూసిన దాఖలాలు లేవు. ముందు షట్టర్‌కు సీలు వేసి దొడ్డిదారి నుంచి సరుకు బయటకు తీసి విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇప్పటికే వైన్స్‌ల వద్దే పర్మిట్ రూములు లేకుండా మద్యం తాగిస్తుండగా, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. బెల్టు షాపుల నుంచి ప్రధాన దుకాణదారులకు నెలవారీ టార్గెట్లు పెట్టి రూ. 30 నుంచి రూ. 50వేలు అద్దె రూపంలో వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల పుణ్యమా అని దొడ్డిదారి విక్రయాలకు తెరలేపడంతో మందుబాబులకు మద్యం మరింత ప్రియం అయింది.

డంపింగ్ యార్డులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు



ఫిరంగిపురంలోని ఓ స్థలంలో చెత్తాచెదారం

- విష సర్పాలకు నిలయం
- చెత్తాచెదారంతో కంపు కొడుతున్న స్థలాలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డులుగా మారాయి. యజమానులు పట్టించుకోకపోవడంతో చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు అవస్థలు పడుతున్నారు. కొత్తపేట, రసూలుపేట, బీఎస్ఎన్ఎల్ బజారు, కొండమెట్ల బజారు, రాజాపేట, శాంతిపేట, రైల్వేస్టేషన్ రోడ్డు, ఎస్టీ కాలనీ, అల్లంవారిపాలెం రోడ్డు, ఆరోగ్యనగర్ రోడ్డు, కరెంటు ఆఫీసు వంటి ప్రాంతాల్లో పలు ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇంటి నిర్మాణాల కోసం కొనుగోలు చేసిన స్థలాల యజమానులు పట్టించుకోకుండా వదిలి వేశారు. దీంతో వాటిల్లో పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయి. కొన్ని స్థలాల్లో మురుగునీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. పాములు, తేళ్లు వంటి విషజీవులు చేరుతున్నాయి. పందులు కూడా సంచరిస్తున్నాయి. దోమలతో రోగాల బారిన పడుతున్నామని నివాసితులు వాపోతున్నారు. పారిశుద్ధ్య కార్మికులు చెత్తను తొలగించకపోవడంతో అవస్థలు పడుతున్నట్లు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి స్థలాలు ఉన్న యజమానులకు నోటీసులు ఇచ్చి, శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.